అభివృద్ధికి సహకరించండి



జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్ సునీత

గౌతంనగర్: డివిజన్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని గౌతంనగర్ డివిజన్ కార్పొరేటర్ మేకల సునీతారాముయాదవ్ శనివారం జోనల్ కమిషనర్ రవికిరణ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన జెడ్సీ నిధుల మంజూరుకు తగిన చర్యలు చేపడతానని హామీ ఇచ్చినట్లు కార్పొరేటర్ తెలిపారు. బీఆర్ఎస్ నేతలు మేకల రాముయాదవ్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన కూచిపూడి ప్రదర్శన



ఉప్పల్ మినీ శిల్పారామంలో ప్రదర్శనతో కళాకారులు

ఉప్పల్: ఉప్పల్ మినీ శిల్పారామంలో నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి. రమేష్‌రాజ్ శిష్య బృందంచే నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శన సభికులను ఆకట్టుకుంది. మూషికవాహనం. అదివో అల్లదిగో, రామాయణ శబ్దం, కృష్ణం కలయ సఖి, శ్రీమన్నారాయణ స్తోత్రం, రఘుకుల తిలక, గోవిందా గోవిందా తదితర అంశాలను కళాకారులు ప్రదర్శించి మెప్పించారు.

వేడుకగా 'ఫ్రెషర్స్ డే'



సాంస్కృతిక ప్రదర్శనతో విద్యార్థులు

ఉప్పల్: లిటిల్ ఫ్లవర్ డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్‌డేను వేడుకగా నిర్వహించారు. శనివారం జరిగిన ఈ కార్యక్రమానికి కళాశాల కరస్పాండెంట్ బ్రదర్ అరుణ్‌ప్రకాష్, ప్రిన్సిపాల్ జయంతిరెడ్డి, అధ్యాపకబృందం హాజరయ్యారు. విద్యార్థులు తమ ప్రతిభను ప్రతిబింబించేలా మిస్టర్ ఫ్రెషర్స్, మిస్‌ఫ్రెషర్ ఎంపిక కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. అనంతరం నిర్వహించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పోటీల్లో పాల్గొన్న విజేతలకు అధ్యాపకులు బహుమతులు ప్రదానం చేశారు.

రూ.6.5లక్షలతో అభివృద్ధి పనులు



పైపులైన్ పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ రాజ్‌జితేంద్రనాథ్

అల్వాల్: మచ్చబొల్లారం డివిజన్ హరిజన బస్తీలో రూ.6.5 లక్షలతో 200 ఎంఎం డయా సీవరేజ్ డ్రైనేజీ పైపులైన్ పనులను శనివారం కార్పొరేటర్ రాజ్‌జితేంద్రనాథ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మచ్చబొల్లారంలోని పలు ప్రాంతాల్లో డ్రైనేజీ సౌకర్యాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. డివిజన్ పరిధిలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. బొబ్బిలి సురేందర్‌రెడ్డి, శ్రీశైలంయాదవ్, సర్వేష్‌యాదవ్, శ్రీనివాస్‌గౌడ్, లడ్డు, వెంకటేష్, విష్ణురావు, దేవా, రవి, సందీప్‌రెడ్డి, వెంకట్, మల్లేష్, శ్రావణ్, రాజేందర్, బస్తీవాసులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



స్థానికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ సునీత

మౌలాలి: మారుతీనగర్‌కాలనీలో అభివృద్ధి పనులు చేపడతామని కార్పొరేటర్ సునీతాశేఖర్‌యాదవ్ అన్నారు. శనివారం ఆమె మారుతీనగర్‌వాసులతో కలిసి రోడ్డును పరిశీలించారు. గుంతలమయంగా ఉన్న రోడ్డు పనులు వెంటనే ప్రారంభిస్తామని పేర్కొన్నారు. మారుతీనగర్‌కాలనీ కమిటీసభ్యులు శ్రీనివాస్, రుద్రరాజు, నాగరాజ్, చక్రధర్, మూర్తి, అధ్యక్షులు శివగౌడ్, ప్రధాన కార్యదర్శి వెంకటేష్‌నేత నాయకులు పాల్గొన్నారు.

పూర్తయ్యేదెప్పుడో ?

- శిథిలావస్థకు చేరుతున్న మోడల్ మార్కెట్లు
- సౌకర్యాలు కల్పించాలని కోరుతున్న ప్రజలు



బీరప్పగడ్డ మోడల్ మార్కెట్

ఉప్పల్: జీహెచ్ఎంసీ సర్కిల్ పరిధిలో రూ. కోట్లు వెచ్చించి నిర్మించిన మోడల్ మార్కెట్లు అధికారుల అలసత్వంతో లబ్ధిదారులకు చేరకుండా గత పదేళ్లుగా ఉత్సవ విగ్రహాల్లా మిగిలాయి చిరువ్యాపారులకు లబ్ధిచేకూరేలా అన్ని రకాల వస్తువులతో పాటు కూరగాయలు ఒకేచోట లభించేలా ఈ మార్కెట్లకు అప్పటి ప్రభుత్వం రూపకల్పన చేసింది.

రోడ్డు పక్కన విక్రయించకుండా..

ఇష్టానుసారంగా రోడ్ల పక్కన కూరగాయలను విక్రయించకుండా ఉండేందుకు వారికంటూ ఓ చోటు ఉండాలనే ఉద్దేశంతో నిర్మించిన మార్కెట్లు ఎవ్వరికీ కాకుండా పోయాయి. రామంతాపూర్ వెంకటరెడ్డినగర్‌లో రూ.50 లక్షలు, ఉప్పల్ బీరప్పగడ్డలో రూ.68.50లక్షలు, ఉప్పల్ గాంధీనగర్‌లో రూ.50 లక్షలు వెచ్చించి ఆధునికహంగులతో మార్కెట్లను నిర్మించారు.

◆ వెంకట్‌రెడ్డినగర్‌లో 15, బీరప్పగడ్డలో 15 (జీ+1) మొత్తం 30 షాపులు, ఉప్పల్ గాంధీనగర్‌లో 19 షాపులను నిర్మించారు.

రిజర్వేషన్ల వారీగా వేలం..

రిజర్వేషన్ల వారీగా షాపుల కేటాయింపు బహిరంగ వేలంలో దాదాపుగా 80 శాతం వరకు లబ్ధిదారులకు అందజేశారు. కానీ మార్కెట్ ప్రాంగణంలో కనీస సౌకర్యాలను కల్పించలేదు.

ముందుగా సౌకర్యాలను కల్పించి వేలం పాడితే బాగుండేదని నిపుణులు అభిప్రాయపడినా ఫలితం లేకుండాపోయింది.

కనీస సౌకర్యాలు కరువు..

విద్యుత్ మీటర్లు, తాగునీటి వసతి లేకపోవడంతో వచ్చేందుకు వ్యాపారులు ఆసక్తి చూపలేదు. పదేళ్లలో రెండు దఫాలుగా వేలం పాడినా.. ఫలితం అదే పరిస్థితి. కాగా ఆలనా పాలన లేకపోవడంతో మోడల్ మార్కెట్లు అసాంఘిక శక్తులకు అడ్డాగా మారింది. దీంతో షాపుల్లోకి వెళ్లేందుకు సాహసించలేకపోయారు.

కనీస సౌకర్యాలు లేవు



కేవలం షాపులను కేటాయించడమే కాకుండా కనీస వసతులు కల్పించాల్సిన బాధ్యత మున్సిపల్ అధికారులపై ఉంది. కేటాయించిన వెంటనే వసతుల గురించి ఎన్నోసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. షాపులకు విద్యుత్ మీటరు లేదు. బాత్రూమ్‌లో నీళ్లు రావు. అందులో ఎలా వ్యాపారం చేయాలి..? అధికారులు స్పందించి కనీస వసతులు కల్పించాలి

– కిషన్, లబ్ధిదారుడు ఉప్పల్

సమస్యలున్న చోట వ్యాపారం ఎలా ?

సమస్యలు ఉన్నచోట వ్యాపారాలు ఎలా సాగించాలి. మాకు కేటాయించిన షాపులో ఫ్యాన్సీ స్టోర్ పెట్టుకున్నాం. కొద్దిరోజుల్లోనే కోవిడ్ రావడంతో అక్కడే కోవిడ్ టెస్టులు నిర్వహించారు. తదానంతరం వసతులు కల్పించాలని అనేకసార్లు విన్నవించాం. రాత్రైతే మందుబాబులకు అడ్డాగా మారింది. రక్షణ కల్పించి వసతులు కల్పిస్తే వ్యాపారం నిర్వహించుకుంటాం.

– మల్లేశ్వరి, లబ్ధిదారు

రీ టెండర్ వేయించి సరైన వసతులు కల్పిస్తాం



త్వరలోనే షాపులకు టెండర్లు కాల్ ఫర్ చేసి షాపులను లబ్ధిదారులకు కేటాయిస్తాం. ముందుగానే మార్కెట్లలో కనీస వసతులు కల్పిస్తాం. ఖచ్చితంగా లబ్ధిదారులను ఆకర్షించేలా తీర్చిదిద్దుతాం. అల్లరిమూకలు రాకుండా కట్టడి చేస్తాం.

– గోధుమల రాజు, ఉప్పల్ డిప్యూటీ కమిషనర్

ఉచిత వైద్య శిబిరాలతో ప్రజలకు మేలు



వైద్య శిబిరంలో కార్పొరేటర్ బన్నాల గీత



తెలుగు బాప్టిస్ట్ చర్చిలో వైద్య శిబిరం దృశ్యం

ఉప్పల్: చైల్డ్ వికాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చిలుకానగర్ ప్రభుత్వ స్కూల్ ఆవరణలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. శనివారం జరిగిన ఈ కార్యక్రమానికి కార్పొరేటర్ గీతాప్రవీణ్ పాల్గొన్నారు. కేర్ ఆసుపత్రి, స్మార్ట్ విజయన్ కంటి అస్పత్రి, ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ అండ్ యూరాలజీ ఆసుపత్రి వైద్య సిబ్బంది హాజరై వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. బీఆర్ఎస్ నేత బన్నాల ప్రవీణ్, గోన పిలిఫ్స్, కొండల్‌రెడ్డి, బలరాం తదితరులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి..

మల్లాపూర్: ఉచిత వైద్య శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని గ్రేటర్ కాంగ్రెస్ సీనియర్ నేత నెమలి అనిల్‌కుమార్ అన్నారు. శనివారం మల్లాపూర్ అన్నపూర్ణ కాలనీ కమ్యూనిటీహాల్‌లో రెడ్‌క్రాస్ సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో సీనియర్ సిటిజన్స్, మహిళలకు ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. కాంగ్రెస్ నేతలు శ్రీకాంత్‌రెడ్డి, వీఎస్ఎన్‌చౌదరి, కాలనీ అధ్యక్షుడు డాక్టర్ కటార్ల శేఖర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

బాప్టిస్ట్ చర్చిలో..

అల్వాల్: యాప్రాల్ ఎంప్లాయీస్ కాలనీలోని తెలుగు బాప్టిస్ట్ చర్చిలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. జనరల్, ఆర్థో, కంటి, డెంటల్, బీపీ, షుగర్, ఈసీజీ పరీక్షలు చేశారు. డాక్టర్ టీఎంఎల్‌వీ న్యూటన్, డాక్టర్ ప్రదీప్‌కుమార్, డాక్టర్ కృష్ణకుమార్, డాక్టర్ రాధిక, చర్చి అధ్యక్షుడు పీటర్ పుష్పరాజ్, శ్యామ్‌బాబు, రవికుమార్, ప్రభాకర్, సుందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ సిబ్బందికి సత్కారం



నాచారం పోలీసులను సత్కరిస్తున్న జేఏసీ నేతలు

మల్లాపూర్: శాంతి భద్రతల విషయంలో ప్రజలకు సేవలందించడంలో నాచారం పోలీసులు ఆదర్శంగా నిలిస్తున్నారని జేఏసీ సంస్థల వ్యవస్థాపకులు నల్లా రాధాకృష్ణ కొనియాడారు. నాచారం పోలీస్‌స్టేషన్ పరిధిలో వినాయక నిమజ్జనాలు ప్రశాంతంగా జరిగేలా కృషి చేసిన నాచారం ఇన్‌స్పెక్టర్ రుద్వీర్‌కుమార్, ఎస్సై ప్రభాకర్‌రెడ్డి, ఏఎస్ఐని ఘనంగా సత్కరించారు. అనంతరం ఇన్‌స్పెక్టర్ రుద్వీర్‌కుమార్ మాట్లాడుతూ.. దేవీనవరాత్రుల ఉత్సవాల్లో ప్రజలకు పోలీసులు సహకరించి శాంతిభద్రతల పరిరక్షణకు దోహదపడాలని సూచించారు. విజయ్‌కుమార్, ప్రేమ్‌కుమార్, సాయిబాబా, గద్ద యుగేందర్, గణేష్‌గౌడ్, వెంకటేశ్వర్లు, శేఖర్‌రెడ్డి, నర్సింహ్మారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, అశోక, వేణు, సురేందర్, నరేంద్ర, చంద్రమౌళి, మోహన్, రాజుగౌడ్ తదితరులున్నారు.

పాత నాణేలకు రూ. కోట్లంటూ బురిడీ

- డబ్బులు ప్యాకింక్ చేస్తున్నట్లు వీడియోలు
- నగదు దండుకున్న సైబర్ నేరగాళ్లు

మేడిపల్లి: పాత నాణేలతో కోట్లాది రూపాయలు వస్తాయనే ఆశతో సైబర్ నేరగాళ్ల వలలో చిక్కిన సంఘటన మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం... మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని గాయత్రి నగర్‌లో నివసించే హరిప్రసాద్(36) రియల్ ఎస్టేట్ వ్యాపారి. తండ్రి లక్ష్మణ్‌రావు టైలర్‌గా పనిచేస్తున్నాడు. వీరి వద్ద పాత నాణేలు ఉన్నాయి. దీంతో వారికి తెలిసిన బంధువులు పాత నాణేలకు పెద్దమొత్తంలో డబ్బులు వస్తాయని చెప్పడంతో తండ్రీకొడుకులు నెట్‌లో సెర్చ్ చేశారు. ఈ క్రమంలో ఆన్‌లైన్‌లో ఓ వ్యక్తితో కాంటాక్టు అయ్యారు. వీరి వద్ద ఉన్న పాత నాణేల ఫొటోలను తీసి పంపగా సైబర్ నేరగాళ్లు మీ పాత నాణేలకు మొత్తం రూ. 2 కోట్ల 35 లక్షల 25 వేలు వస్తాయని నమ్మబలికారు. వీరికి ఆన్‌లైన్ వీడియోలో డబ్బు కట్టలను ప్యాక్ చేస్తున్న వీడియోను పంపించారు. అనంతరం ఫోన్ చేసి శంషాబాద్ ఎయిర్ పోర్టులోకి మీ డబ్బులు వచ్చాయని... ఆ డబ్బులకు జీఎస్టీ కట్టాలని బాధితుడి నుంచి రూ. 17,500లను ఆన్‌లైన్ ద్వారా తీసుకున్నారు నేరగాళ్లు. తరువాత వెంటనే సెల్ ఫోన్‌ను స్విచ్ ఆఫ్ చేశారు. దీంతో బాధితులు పలు మార్లు ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ రావడంతో మోసపోయామని గ్రహించి మేడిపల్లి పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ గోవిందరెడ్డి తెలిపారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి



ఘట్‌కేసర్: పర్యావరణ సంరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ జ్యోతి అన్నారు. మున్సిపాలిటీలోని అంకుషాపూర్‌లో తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల్ బుద్వేల్ డిగ్రీ మహిళా కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు స్థానిక ప్రాథమిక, జెడ్పీ విద్యార్థులతో కలిసి శనివారం మొక్కలు నాటారు. స్థానికులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ.. ఎన్ఎస్ఎస్ క్యాంపులో భాగంగా గ్రామంలో రోజుకో అంశంలో స్థానికులకు అవగాహన కల్పిస్తామన్నారు.

హోటల్ మేనేజ్‌మెంట్‌కు ప్రత్యేక గుర్తింపు

అల్వాల్: పారిశ్రామికరంగంలో హోటల్ మేనేజ్‌మెంట్ విభాగం ప్రత్యేక స్థానాన్ని పొందుతుందని విద్యార్థులు అధికశాతం హోటల్ రంగం వైపు మొగ్గు చూపుతున్నారని, నారాయణ హోటల్ మేనేజ్‌మెంట్ డైరెక్టర్ రామానుజన్ అన్నారు. శనివారం అల్వాల్‌లోని నారాయణ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాలలో జరిగిన ఫ్లోరల్ ఫ్రెంజీ వార్షిక గ్రాండ్ ఫ్లవర్ అరెంజ్‌మెంట్ ఫెస్ట్‌లో ఆయన పాల్గొని విద్యార్థులకు పలు మార్గదర్శకాలు, సూచనలు చేశారు. హౌస్‌కీపింగ్ అనేది హోటల్ విభాగంలో ముఖ్యపాత్ర పోషిస్తుందన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకోగా వారిని అభినందించారు. ప్రిన్సిపాల్ షీలా తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లతో కేసుల సత్వర పరిష్కారం



కుషాయిగూడ: లోక్ అదాలత్‌లతో కేసులకు సత్వర పరిష్కారం లభిస్తుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.ఎన్. శ్రీదేవి అన్నారు. జాతీయ, రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థల ఆధ్వర్యంలో శనివారం కుషాయిగూడలోని మల్కాజిగిరి జిల్లా కోర్టులో ఏర్పాటు చేసిన జాతీయ లోక్ అదాలత్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా లోక్ అదాలత్‌లో పరిష్కారమయ్యే కేసుల వివరాలు తెలిపి కక్షిదారులకు అవగాహన కల్పించారు. 26 బెంచీల్లో 151 సివిల్ కేసులు, 62,103 అన్ని రకాల క్రిమినల్, ట్రాఫిక్ కేసులను పరిష్కరించడంతో పాటు 298 ప్రీలిటిగేషన్ కేసులకు పరిష్కారం చూపి రూ. 95,02,279 పరిహారంగా చెల్లించారు. ఈ అదాలత్‌లో మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి తిరుపతి, బార్ అసోసియేషన్ ప్రతినిధులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, లీగల్ ఎయిడ్, డిఫెన్స్ కౌన్సెల్స్, పోలీసు, బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు.

వ్యక్తిగత నైపుణ్యంతోనే ఉపాధి అవకాశాలు

ఘట్‌కేసర్: వ్యక్తిగత నైపుణ్యంతో ఉపాధి అవకాశాలు మెరుగుపడుతాయని మెగా, ఒమెగా విద్యాసంస్థల వైస్ చైర్మన్ కసిరెడ్డి మాలతీరెడ్డి అన్నారు. శనివారం ఏదులాబాద్ మెగా ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన అంతర్జాతీయ కాన్ఫరెన్స్ ఆన్ ఇండియన్ నాలెడ్జ్ సిస్టమ్-2025 ముగింపు వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు నిత్యం సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించుకోవాలని, అది లేకుండా విజయం సాధించలేమన్నారు. మన లక్ష్యాలను చేరుకోవాలంటే కమ్యూనికేషన్ స్కిల్స్ పెంచుకోవాలని సూచించారు. కళాశాల అధ్యాపకులు, తల్లితండ్రులు చూపిన మార్గంలో పయనించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. అనంతరం సావనీర్‌ను ఆవిష్కరించారు. బ్రహత్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి రామకృష్ణ, ప్రిన్సిపాల్ రామసుబ్రహ్మణ్యం, వైస్ ప్రిన్సిపాల్ సాయివెంకటకృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తా



ఎమ్మెల్యేతో బీఆర్ఎస్‌లో చేరిన స్థానిక నేతలు

ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

మౌలాలి: నియోజకవర్గాన్ని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. శనివారం సాయంత్రం ఆయన ఆర్టీసీ కాలనీ, షఫీనగర్‌లో రూ.28 లక్షలతో చేపట్టనున్న స్ట్రామ్‌వాటర్‌లైన్, మౌలాలి డివిజన్‌లోని షాదుల్లానగర్‌లో రూ.27లక్షలతో చేపట్టనున్న సీసీరోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలో మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యతను ఇచ్చి ముందుకెళ్తామన్నారు. నియోజకవర్గాన్ని మోడల్‌గా తీర్చిదిద్దేందుకు కృషిచేస్తానన్నారు. ఏసీ మధురిమ, బీఆర్ఎస్ నేతలు అమీనుద్దీన్, మేకల రాముయాదవ్, సత్యనారాయణ, ఉస్మాన్ వంశీ ముదిరాజ్, ఆదినారాయణ, మారుతీప్రసాద్, సంతోష్‌గుప్తా, హేమంత్‌పటేల్, నవాబ్, దినేష్, మురళినాయుడు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లోకి చేరికలు..

గౌతంనగర్: ప్రజా సంక్షేమం బీఆర్ఎస్ పార్టీతోనే సాధ్యమని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. గౌతంనగర్ డివిజన్‌కు చెందిన పలువురు కాంగ్రెస్, బీజేపీ నేతలు శనివారం ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి ఆయన ఆహ్వానించారు. కార్పొరేటర్ మేకల సునీతారాముయాదవ్, మాజీ కార్పొరేటర్ ఏకే.మురుగేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎంఎంటీఎస్ స్టేషన్ ఏర్పాటుకు సహకరించండి



ఎంపీ ఈటలతో కార్పొరేటర్ శ్రవణ్, డీఆర్‌యూసీసీ సభ్యుడు నూర్

మల్కాజిగిరి: ఆనంద్‌బాగ్‌లో ఎంఎంటీఎస్ స్టేషన్ ఏర్పాటుకు సహకరించాలని ఆనంద్‌బాగ్ రైల్వేస్టేషన్ సాధన సమితి సభ్యులు స్థానిక కార్పొరేటర్ శ్రవణ్, డీఆర్‌యూసీసీ సభ్యుడు నూర్‌లతో కలిసి శనివారం ఎంపీ ఈటల రాజేందర్‌కు విజ్ఞప్తి చేశారు. వారు మాట్లాడుతూ.. మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలో పలుచోట్ల ఆర్‌యూబీ, ఆర్‌ఓబీల నిర్మాణం కావడానికి ఎంపీ చొరవ అభినందనీయమన్నారు. ఆనంద్‌బాగ్ ఎంఎంటీఎస్ స్టేషన్ ప్లాట్‌ఫామ్ నిర్మాణానికి రూ. 5 లక్షలు అందజేస్తానని సాధన సమితి సభ్యులు శాస్త్రి, నాగేశ్వరరావులకు హామీ ఇచ్చారు. ఆనంద్‌బాగ్ స్టేషన్ నిర్మాణంతో మౌలాలి, చర్లపల్లి నుంచి దూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు.

మార్పులకనుగుణంగా విద్యాబోధన



అల్వాల్‌లో ప్రైవేటు ఉపాధ్యాయులకు శిక్షణ

అల్వాల్: సెరియానగర్‌లోని సెయింట్ అల్ఫోన్సస్ హైస్కూల్‌లో శనివారం అల్వాల్ మండల ప్రైవేట్ ఉపాధ్యాయుల కోసం ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అల్వాల్ మండల విద్యాధికారి మురళీకృష్ణ హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న మార్పులకు అనుగుణంగా విద్యాబోధనలో మార్పులు చోటుచేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ శిక్షణ శిబిరానికి 50 స్కూళ్ల నుంచి 205 ఉపాధ్యాయులు హాజరయ్యారు. అల్వాల్ మండల ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మల్కాజిగిరి స్టేషన్‌కు ఎక్స్‌ప్రెస్ రైల్



ఫ్లకార్డుతో స్వాగతం పలుకుతున్న రైల్వే అధికారులు

గౌతంనగర్: మల్కాజిగిరి రైల్వేస్టేషన్‌లో మొదటి ఎక్స్‌ప్రెస్ రైల్ హైదరాబాద్ నుంచి హిసారా ఎక్స్‌ప్రెస్ రైలుకు శనివారం జెడ్‌ఆర్‌యూసీసీ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జెడ్‌ఆర్‌యూసీసీ సభ్యులు నూర్ మాట్లాడుతూ.. దూర ప్రాంతాల నుండి వచ్చే రైళ్లను మల్కాజిగిరి రైల్వేస్టేషన్‌లో నిమిషం పాటు నిలపాలని గతంలో రైల్వేశాఖకు కోరారు. ఈ మేరకు స్పందించిన సౌత్ సెంట్రల్ రైల్వే మల్కాజిగిరి రైల్వే స్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్‌రైల్‌ను నిలిపినందుకు కృతజ్ఞతలు తెలిపారు. స్టేషన్ మేనేజర్ శ్రీనివాస్‌రావు, రైల్వే సిబ్బంది ప్రయాణికుల సంఘం ప్రతినిధులు స్వామి, భరద్వాజ్, హసీనా, శంకర్‌రావు, వెంకటేష్‌చారి, సత్యమూర్తి, రోషన్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో విద్యార్థుల ప్రతిభ



ఖోఖోలో ట్రోఫీ అందుకుంటున్న విజేతలు

మల్లాపూర్: 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన ఉప్పల్ జోనల్ లెవల్ క్రీడా పోటీల్లో మల్లాపూర్ మోడ్రన్ స్కూల్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి అగ్రస్థానంలో నిలిచారు. ఖోఖో సీనియర్ బాయ్స్, గర్ల్స్, జూనియర్‌బాయ్స్ గర్ల్స్ విభాగంలో ప్రథమ బహుమతి దక్కించుకుని జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వాలీబాల్ అండర్- 17 బాలికల విభాగంలో రెండోస్థానంలో నిలిచి జిల్లాస్థాయి పోటీలకు అర్హత సాధించారు. శనివారం పోటీలో గెలిచిన విద్యార్థులను కరస్పాండెంట్ సచీదేవీ అభినందించారు. అనంతరం స్కూల్ చైర్మన్ ముత్యంరెడ్డి విద్యార్థులను చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రోత్సహిస్తున్నామన్నారు. విద్యార్థులకు శిక్షణనిస్తున్న పీఈటీ నరేంద్రను అభినందించారు.

ఉప్పల్: జోనల్ స్థాయి స్కూల్ గేమ్స్ ఆటల పోటీల్లో పాల్గొని విజయం సాధించిన విజేతలకు ఉప్పల్ జిల్లా పరిషత్ స్కూల్ ఆవరణలో బహుమతులు ప్రదానం చేశారు. జోనల్ స్థాయి ఖోఖో, కబడ్డి, వాలీబాల్, తదితర ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. మండల విద్యాధికారి రామారావు, సెక్రటరీ పద్మావతి, స్కూల్ ప్రధానోపాధ్యాయులు శిరీషలు శుక్రవారం సాయంత్రం ట్రోఫీలను అందజేశారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



కార్పొరేటర్‌కు వినతిపత్రం ఇస్తున్న కాలనీవాసులు

మౌలాలి: స్థానిక సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని కార్పొరేటర్ రాజ్యలక్ష్మి అన్నారు. లక్ష్మీనగర్‌కాలనీలో డ్రైనేజీ, రోడ్డు సమస్య, విద్యుత్, పారిశుద్ధ్యం తదితర సమస్యలు ఉన్నాయని స్థానికులు కార్పొరేటర్ దృష్టికి తీసుకొచ్చారు. విద్యుత్‌లో లో ఓల్టేజ్‌తో రోజూ ఇబ్బందులు పడుతున్నామన్నారు. వెంటనే ఆమె ఎలక్ట్రికల్ ఏఈ శ్రీనివాస్‌తో మాట్లాడి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కెపాసిటీని పెంచాలని సూచించారు. ఎంటమాలజీ ఏఈ వనజతో మాట్లాడి దోమలబెడద లేకుండా చూడాలని ఆదేశించారు. విద్యుత్ దీపాల సమస్యను వెంటనే పరిష్కరించాలని అక్కడే ఉన్న ఏఈ స్ట్రీట్‌లైట్ వెంకటేష్‌ను ఆదేశించారు. గతుకుల రోడ్లు, డ్రైనేజీ సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కాలనీ అధ్యక్షుడు జయకుమార్, కార్యదర్శి సురేష్, ఈస్ట్ ఆనంద్‌బాగ్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధానకార్యదర్శి సుబ్రహ్మణ్యం, కోశాధికారి రవికుమార్, బీజేపీ నేతలు ఓంప్రకాష్, గోపాల్‌యాదవ్ పాల్గొన్నారు.